## కన్నుల పండుగగా శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

❖ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వరంగల్ ఎంపీ

❖ జనగాం జిల్లా స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గం





**దశ, జనగాం:** చిల్పూర్ మండల కేంద్రంలోని చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎంపీకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవ కార్యక్రమాలను తిలకిస్తూ భక్తులతో కలిసి భక్తిసేవలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యవంతంగా ఉండాలని ఆకాంక్షించారు. చిల్పూర్ గుట్ట ఆలయం ప్రాంత ప్రజలకే కాకుండా పరిసర జిల్లాల భక్తులకు కూడా ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న, దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ధర్మకర్త మండలి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అర్చకులు ఆలయ సిబ్బంది, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంజాయి మత్తు నుండి యువతను కాపాడుకుందాం

❖ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్

❖ వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం

❖ గంజాయి రహిత నగరంగా మారుద్దాం

❖ గంజాయిను విక్రయించే కీలక వ్యక్తులను పట్టుకోండి.

❖ అక్రమ ఇసుక రవాణాకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించండి



**దశ, హనుమకొండ:** దేశ భవిష్యత్తుయిన యువత గంజాయి మత్తు బానిసలు కాకుండా గంజాయి విక్రయించే మూలాలపై దృష్టి పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశాన్ని శనివారం కాకతీయ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులు, వారెంట్లు, అధికారులు, సిబ్బంది పనితీరుపై వరంగల్ పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నేరాల నియంత్రణకై తీసుకోవాల్సిన చర్యలపైపలుసూచనలుచేస్తూకమిషనరేట్ పరిధిలోపేకాటరాయుళ్ళపై కఠినంగా వ్యవహరించాలని, ప్రధానంగా శివారు ప్రాంతాల్లో స్థానిక పోలీసులు నిరంతరం నిఘా పెట్టాలని,చోరీలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలని, అధికంగా చోరీలు జరిగే ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని,అదే విధంగా యం.జి.యం,రైల్వే స్టేషన్ల ప్రాంతాల్లో సైతం సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు, కృషి చేయాలని, స్టేషన్ అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేయాలని, గంజాయి వినియోగదారున్ని పట్టుకోవడంతో మన బాధ్యత అయిపోతుందని అనుకొంకుండా గంజాయిని విక్రయించే వారి గుర్తించి అరెస్టు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, అక్రమ ఇసుక రవాణాపై స్టేషన్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని, ఎవరైన ఆలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని, అలాగే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్,రాజమహేంద్ర నాయక్,కవిత, శుభంనాగ్‌తో పాటు అదనపు డిసిపిలు, ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, అర్. ఐలు ఎస్.ఐలు పాల్గొన్నారు.



## నూతన ఆలయనిర్మానానికి శంకుస్థాపన

**దశ, నడిగూడెం :** స్వగ్రామం నడిగూడెం మండలం కర్విరాల గ్రామంలో యాదవ కులస్తులు నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ తల్లి దేవాలయ శంకుస్థాపన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల దేవత గంగమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక కేంద్రాలు ఏర్పడడం ద్వారా ప్రశాంత వాతావరణం మరింత బలపడుతుందని తెలిపారు.అలాగే గ్రామాభివృద్ధి కోసం నిరంతరం తనవంతు సహకారం అందిస్తానని, ప్రజల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఉపేందర్ యాదవ్, సర్పంచ్ పార్వతమ్మ, ఉపసర్పంచ్ కృష్ణ రెడ్డి, సురేందర్, ప్రసాద్ యాదవ్,నరేశ్,వెంకటేశ్,లింగయ్య,పుల్లయ్య,ఉపేందర్,కమల్ తదితర యాదవ కుటుంబాలు పాల్గొన్నారు.



## మల్కాజిగిరిలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**దశ న్యూస్, మేడ్చల్ మల్కాజిగిరి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మల్కాజిగిరిలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్ర విభాగాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. ఈ ఏడాది 'ఉమెన్ ఇన్ సైన్స్: క్యాటలైజింగ్ విక్సిత్ భారత్' థీమ్‌కు అనుగుణంగా విద్యార్థులు శాస్త్ర రంగంలో మహిళల పాత్ర, వారి కృషిపై ప్రసంగాలు చేశారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సభాధ్యక్షులు డాక్టర్ అడవి రాజు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైంటిఫిక్ టెంపర్‌ను పెంపొందించుకోవడం సమాజ అభివృద్ధికి అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కుక్కలు, కోతులను నివారించండి

❖ కార్పొరేషన్ మేయర్ గణేష్ కు విజ్ఞప్తి



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లో కుక్కలు కోతుల బెడద తీవ్రంగా ఉందని వీటి నివారణకు చర్యలు చేపట్టి ప్రజలు ప్రశాంతంగా ఉండే విధంగా చూడాలని రైల్వే బోర్డు మెంబర్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, 55వ డివిజన్ కార్పొరేటర్ హరిహరన్ లు విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ ను శనివారం సౌత్ సెంట్రల్ రైల్వే డి.ఆర్.యు.సి. సి.మెంబర్, మాజీ కౌన్సిలర్ వై.శ్రీనివాస్ రెడ్డి 55వ, డివిజన్ కార్పొరేటర్ సింగర హరిహరన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శాలువాతో సత్కరించి అభినందించి శుభాకాంక్షలు చెప్పారు. ముందుగా డివిజన్ లలో కోతులు కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతూ మేయర్ గణేష్ కు వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి, హరిహరన్ మాట్లాడుతూ 55వ డివిజన్లో గత రెండు సంవత్సరాల క్రితమే 50 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి టెండర్ పూర్తి చేసి శంకుస్థాపన చేశారని కానీ నేటి వరకు పనులు ప్రారంభించలేదని వారు మేయర్ దృష్టికి తీసుకువెళ్లారు. కొత్తగూడెం కార్పొరేషన్ లో భాగంగా గతంలో ఉన్న వార్డు స్థానంలో డివిజన్ గా ఏర్పడి జనాభా సంఖ్య కూడా పెరిగిందని గతంలో మంజూరైన 50 లక్షలతో పాటు మరో 50 లక్షలు అదనంగా మంజూరు చేసి కోటి రూపాయలతో డివిజన్ ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా మినీ ఫంక్షన్ కమ్యూనిటీ హాల్ నిర్మించి ప్రజలకు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. అదేవిధంగా ప్రజలను వృద్ధులను పిల్లలను గాయపరుస్తూ దాడులు చేస్తూ ఇబ్బంది పెడుతున్న కోతులును కుక్కలను ప్రత్యేక డ్రైవ్, నిధి ఏర్పాటు చేసి పూర్తిగా పట్టించి దూరంగా చింతూరు అడవుల్లో విడిచి పెట్టే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని మేయర్ కి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మేయర్ గణేష్ మాట్లాడుతూ తప్పనిసరిగా 55వ డివిజన్లో మినీ ఫంక్షన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని కోతులు కుక్కల పట్టివేతకు అధికారులతో చర్చించి కఠినమైన ఆదేశాలు ఇచ్చి పూర్తిగా స్పెషల్ డ్రైవ్ నిధి ఏర్పాటు చేసి పూర్తిగా పట్టించి దూరంగా దట్టమైన అడవుల్లో విడిచిపెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## శాస్త్రీయ ప్రగతే..విశ్వ ప్రగతికి మూలం

❖ పాఠశాల కరస్పాండెంట్ షేఖ్ అబ్దుల్ బాసిత్







**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** శాస్త్రీయ ప్రగతే విశ్వ ప్రగతికి మూలమని శాస్త్రీయంగా ఆలోచించి శాస్త్రవేత్తలై సమాజానికి సేవ చేయాలని పాఠశాల కరస్పాండెంట్ షేఖ్ అబ్దుల్ బాసిత్ అన్నారు. శనివారం మోడ్రన్ ఇఖ్రా స్కూల్ రామవరంలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త సర్ సి.వి రామన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేఖ్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ నేడు ప్రపంచ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఊహించని ప్రగతి సాధించిందని సాధించిన ప్రగతిని అభివృద్ధి కంటే వినాశనానికే ఎక్కువగా ఉపయోగించడం దురదృష్టం అన్నారు. యుద్ధ వినాశం కోసం కాకుండా మానవ ప్రగతి వినియోగించాలని విద్యార్థులను కోరారు. విద్యార్థిని విద్యార్థులు సైన్స్ మానవ సమాజానికి చేస్తున్న మేలు గురించి చక్కగా వివరించారు. సైన్స్ రంగంలో భారతీయ శాస్త్రవేత్తలు, సార్ సి వి రామన్, ఎ బి జె అబ్దుల్ కలాం, సుభాష్ చంద్రబోస్, మేరీ విలీయం, చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. వారి భాటలో నడిచి దేశాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన ప్రయోగాలు ఆలోచింపజేసాయి. విజ్ఞాన శాస్త్రం గొప్పతనాన్ని గురించి తెలుపుతూ చేసిన నృత్యం గానం విద్యార్థులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ షేఖ్ అబ్దుల్ బాసిత్, ప్రధాన అధ్యాపకురాలు పర్వీన్ సుల్తానా, టీచర్లు నీలా, శిరీషా, సరస్వతి, ప్రసన్న, విజయలక్ష్మీ, సల్మా,. జేఫీషా, అనితా తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన బీజేపీ రాష్ట్ర నాయకురాలు కవిత రెడ్డి

**దశ, నడిగూడెం :** నడిగూడెం మండల కేంద్రంలోని కొల్లు కోటయ్య మెమోరియల్ ఫంక్షన్ హాల్‌లో మాజీ బిజెపి మండల అధ్యక్షులు దున్న సతీష్ వివాహ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి బిజెపి రాష్ట్ర నాయకురాలు బండారు కవిత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నడిగూడెం మండలంలోని వివిధ హోదాల్లో ఉన్న బిజెపి నాయకులు, బూత్ అధ్యక్షులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాంతినికేతన్ స్కూల్ లో ఘనంగా సైన్స్ డే వేడుకలు

**దశ, వరంగల్:** వరంగల్ పిన్నివారి స్ట్రీట్ లోని శాంతినికేతన్ స్కూల్ లో జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ 'రామన్ ఎఫెక్ట్' ఆవిష్కరణను స్మరించుకుంటూ ఈ వేడుకలు నిర్వహించడం జరుగుతోంది. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ చైర్మన్ శ్రీరాముల వెంకటేశ్వర్లు సర్ సివి రామన్ ఫోటో ఆవిష్కరణ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ ప్రాజెక్టులు, నమూనాలను పరిశీలించి వారి ఆలోచనా విధానం, ప్రయోగాలపై ప్రశ్నలు అడిగి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ప్రస్తుత కాలంలో ఎంతో కీలకమైందని, విద్యార్థులు చిన్నప్పటి నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. నేటి చిన్న ప్రయోగాలే రేపటి గొప్ప ఆవిష్కరణలకు మార్గదర్శకమవుతాయని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో భారత శాస్త్రవేత్తలు సాధించిన విజయాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే సమాజంలో జరుగుతున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా తమ జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలని, చదువుతో పాటు సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం కూడా అవసరమని వివరించారు. తదుపరి విద్యార్థుల ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మంచి మార్కులు వారికి కేటాయిస్తామని తెలిపారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## క్రీడాకారులను ప్రోత్సహించడానికి సింగరేణి ముందుంటుంది

❖ సింగరేణి జయం పర్సనల్ వెల్ఫేర్ కిరణ్ కుమార్

❖ ఘనంగా సింగరేణి కార్పొరేట్ ఏరియా

❖ 19వ వార్షిక క్రీడా సాంస్కృతిక వార్షికోత్సవం




**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** క్రీడాకారులను ప్రోత్సహించడానికి సింగరేణి ఎల్లప్పుడూ ముందుంటుందని సింగరేణి జిఎం పర్సనల్ వెల్ఫేర్ జీవి కిరణ్ కుమార్ అన్నారు. సింగరేణి కార్పోరేట్ ఏరియా ఆధ్వర్యంలో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 19వ క్రీడా వార్షికోత్సవంను కొత్తగూడెం సిఈఆర్ క్లబ్ నందు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిఎం(పర్సనల్)వెల్ఫేర్ జివి.కిరణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రత్యేక బడ్జెట్ ను కేటాయిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ తమ పనులను నిర్వహిస్తూనే క్రీడలలో ఆసక్తి చూపడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ క్రీడలలో సీనియర్ క్రీడాకారులతో పాటు యువ ఉద్యోగులు ఎక్కువగా పాల్గొనేలా ప్రోత్సహించి కోల్ ఇండియా స్థాయి పోటీలలో మన సంస్థ మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. తదుపరి వివిధ క్రీడల్లో గెలుపొందిన ఉద్యోగులకు అభినందనలు తెలిపి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ డబల్యూపిఎస్ అండ్ జిఎ కార్పొరేట్ ప్రెసిడెంట్ జి.వి.కిరణ్ కుమార్ తో పాటు డిజిఎం(పర్సనల్) కేసా నారాయణరావు, డిజిఎం (పర్సనల్) బి.శివకేశవ రావు, గుర్తింపు సంఘం( ఏఐటియుసి) బ్రాంచ్ సెక్రటరీ ఏస్.వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్టియుసి) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పితాంబర రావు, సిఎంఒఏఐ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ కేశవరావు, డివైపిఎం అండ్ కార్పొరేట్ ఏరియా హనరరీ సెక్రటరీ కే.సునీల్ కుమార్, సీనియర్ పిఓ ఏం.శ్రీనివాస్, కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎన్. సుజ్ఞాన్, స్పోర్ట్స్ సూపర్వైజర్ ఎంసి.పోస్నెట్, కార్పొరేట్ ఏరియా స్పోర్ట్స్ కొఆర్డినేటర్ పి.నితిన్ కుమార్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

❖ *జిల్లా కలెక్టర్ అంకిత్*



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ఈనెల 27, 28 తేదీలలో జరగనున్న శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం, మహా పట్టాభిషేక ఉత్సవాలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు ముందస్తుగా అప్రమత్తమై పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సిద్ధం చేయాలని శనివారం సంబంధిత అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. ఆదివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భద్రాచలంలో పర్యటించి ఏర్పాట్లపై సమీక్షించనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులపై భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాలు క్యూలైన్లు కళ్యాణ వేదిక వద్ద పారిశుద్ధ్య నిర్వహణకు పకడ్బందీ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి కుళాయిలు, వాటర్ ప్యాకెట్ల సేకరణ వంటి పనులను ముందస్తుగానే పూర్తి చేయాలని ఆలయ ఈవో దామోదర్ రావు పర్యవేక్షణలో విద్యుదీకరణ ఆలయ సుందరీ కరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం వైద్య ఆరోగ్య శాఖ క్యూలైన్ల వద్ద వైద్య శిబిరాలను, అవసరమైన మందులు సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని ఏరియా ఆసుపత్రిలో అత్యవసర విభాగాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అగ్నిమాపక శాఖ వారు అవసరమైన ఫైర్ సేఫ్టీ పరికరాలతో సిద్ధంగా ఉండాలని పోలీస్ ట్రాఫిక్ విభాగాలు సమన్వయం చేసుకొని వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక సెక్టార్లను ఇప్పుడే ఖరారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తుల వసతి కోసం ఆన్‌లైన్ బుకింగ్, టికెట్ విక్రయాల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని ఉత్సవ విధుల్లో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని తెలిపారు. ఏర్పాట్లలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా భక్తులకు భక్తి పరిపూర్ణమైన అనుభూతిని అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



# పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

❖ *జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** పీఎం విశ్వకర్మ పథకాన్ని వృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి సూచించారు. శనివారం రుద్రంపూర్ సీఈఆర్ క్లబ్‌లో పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ, పీఎం ఈజీపీ పథకాలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నిరుద్యోగులకు చేతివృత్తులు చేసుకునే వారికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ పథకాలకు దరఖాస్తు చేసే విధానం అందించే సబ్సిడీ శాతం అర్హత ప్రమాణాలు అలాగే ఏఏ రంగాలకు చెందిన వారు అర్హులనే అంశాలపై సమగ్రంగా వివరించారు. అనంతరం ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ) మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ బ్యాంకు రుణాలపై సమగ్ర వివరాలు వెల్లడించారు. రుణం పొందేందుకు అవసరమైన అర్హతలు దరఖాస్తు విధానం లబ్ధిదారులు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు ఐపీపీబీ ఖాతాలను ప్రారంభించి ఆన్‌లైన్ మర్చంట్ స్టికర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫెసిలిటేషన్ ఆఫీసర్(ఎంఎస్ఎంఈ) దినేష్ కుమార్, ర్యాంప్ ఈడీసీ మేనేజర్ వసంత తదితరులు పాల్గొన్నారు.



## ఈస్ట్ ఇంద్ర నెహ్రూ నగర్‌లో శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం

**దశ న్యూస్, మేడ్చల్ మల్కాజిగిరి:** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ ఇంద్ర నెహ్రూ నగర్‌లో శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కళ్యాణ మహోత్సవం 25వ తేదీ నుంచి మార్చి 1, 2026 వరకు ప్రత్యేక పూజలతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతోనే గుర్తింపు


❖ *సెక్యూరిటీ అధికారి జాకీర్ హుస్సేన్*






**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** విధి నిర్వహణలో క్రమశిక్షణతో ముందుకు పోతానే గుర్తింపు లభిస్తుందని ఏరియా సెక్యూరిటీ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్ అన్నారు. ట్రైనింగ్ సెంటర్లో సెక్యూరిటీ సిబ్బందికి వారం రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని సూచించారు. శిక్షణ కార్యక్రమంతో సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగు పడిందని వారం రోజుల శిక్షణా కాలంలో ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌లోని అన్ని అంశాలపై బోధించడం జరిగిందని పేర్కొన్నారు. మెయిన్ హాస్పిటల్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, భద్రాద్రి కొత్తగూడెం ఫైర్ స్టేషన్ నుండి ఫ్యాకల్టీని తీసుకోవడం జరిగిందని వివరించారు. మనకు ఫస్ట్ఎయిడ్ పై అవగాహన ఉంటే మన తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళే లోపు వారి ప్రాణాలను కాపాడవచ్చునని మనం పని చేయు ప్రదేశాలలో అగ్ని ప్రమాదం సంభవించినపుడు వాటిని నివారించి సింగరేణి ఆస్తులను పరిరక్షించగలమని మెరుగైన వృత్తి నైపుణ్యంతో క్రమశిక్షణతో నీతినిజాయితీతో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికై సెక్యూరిటీ సిబ్బంది అందరూ పాటుపడాలని తెలిపారు. అనంతరం శ్రీ జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయ నిర్వాహకులకు సెక్యూరిటీ సిబ్బందిచే నిత్యావసర సరుకులను వితరణ గావించారు. కోర్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరచిన కె.కుమార్, యం.శివనారాయణకు బహుమతి ప్రదానం గావించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్స్పెక్టర్ డి.నారాయణ రెడ్డి సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా కల్యాణ లక్ష్మి



**దశ, భూపాలపల్లి:** పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం ఆర్థిక భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు మండల కేంద్రంలోని రైతు వేదికలో పలు గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు అనంతరం ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా కొంత ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, రాష్ట్ర అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా ముందుకు తీసుకెళ్తున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలోనే అనేక ప్రజా ప్రయోజనకర కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటోందని ఆయన అన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలిచి సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ చేరువ కావడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో కూడా పాల్గొని వార్డు సభ్యులకు తగు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, చింత రవి,సర్పంచి గజ్జి ఐలయ్య,రవిపాల్, పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రధానోపాధ్యాయులు చుక్కల వెంకటయ్య పదవీ విరమణ మహోత్సవం

❖ *జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు గ్రహీత*

**దశ, అడ్డగూడూర్:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూర్ మండలం కోటమర్తి గ్రామంలోని పీఎం శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ చుక్కల వెంకటయ్య గారి పదవీ విరమణ కార్యక్రమం శనివారం అత్యంత ఘనంగా జరిగింది. 36ఏళ్ల సుదీర్ఘ విద్యా సేవ అనంతరం ఆయన పదవీ విరమణ చేశారు. వారు గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, గ్రామ సర్పంచ్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యారంగంలో వారు చేసిన సేవలు కొనియాడారు . తన పదవీకాలంలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని తనక వృత్తిపట్ల ఎంతో అంకితభావంతో పని చేశారని పేర్కొన్నారు.

**విద్యా రంగానికి మరువలేని సేవలు**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాల్యమిత్ర యువజన సంఘం అధ్యక్షులు శీల ఎలేందర్ మాట్లాడుతూ.. వెంకటయ్య సార్ గత మూడున్నర దశాబ్దాలుగా ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. క్రమశిక్షణ, అంకితభావంతో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువతకు ఆదర్శప్రాయం ఉద్యోగ విరమణ అనంతరం కూడా వెంకటయ్య తన అనుభవంతో యువతకు దిశానిర్దేశం చేస్తూ ఆదర్శంగా నిలవాలని కోరారు. సమాజ శ్రేయస్సు కోసం ఆయన ఇచ్చే సలహాలను, సూచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బాల్యమిత్ర యువజన సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విష్ణువర్ధన్ , ఉప సర్పంచ్ శ్రీశైలం,బాల్యమిత్ర యువజన సంఘం ఉపాధ్యక్షులు ఉమేష్, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్, సెక్రటరీలు సుమన్, కృష్ణ మరియు ఇతర సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీ

❖ *నలుగురు ఉద్యోగులు తొలగింపు*
❖ *అర్చకుడికి చార్జ్ షీట్*
❖ *ఈవో, సూపరింటెండెంట్ సస్పెన్షన్‌కు ఆదేశం*

**దశ,వరంగల్:** బల్కంపేట ఎల్లమ్మ దేవాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అటవీ,పర్యావరణ, మరియు దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ శుక్రవారం ఆకస్మిక తనిఖీ సందర్భంగా దేవాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించిన పలువురు అధికారులపై వేటు వేశారు..ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం వంటి తీవ్రమైన అంశాలను మంత్రి గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నలుగురు సిబ్బందిని సేవల నుండి తొలగించాలని మంత్రి ఆదేశించారు. స్వీపర్ (ఔట్‌సోర్సింగ్) జి. రాము, అటెండర్ (రెగ్యులర్) ఎస్. శ్రీహరి, స్వీపర్ (ఔట్‌సోర్సింగ్) పి. నరసింహ, సీనియర్ అకౌంటెంట్ (ఔట్‌సోర్సింగ్) జి. ప్రభాకర్ రావును విధుల నుండి తొలగించాలని నిర్ణయించారు. అర్చకుడు ఎ. శ్రీనివాస చార్యులపై చార్జ్ షీట్ మెమో జారీ చేయాలని ఆదేశించారు. అలాగే, పరిపాలనా మరియు పర్యవేక్షణ లోపాల కారణంగా దేవాలయ సూపరింటెండెంట్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)లను సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని, తదుపరి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులకు మంత్రి ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ నిర్వహణ పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేసినట్లు తెలిసింది.



## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

❖ *చిన్నతనం నుండే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి: సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి*



**దశ,తుంగతుర్తి:** విద్యార్థులు చిన్న తనం నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం తో పాటు ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని తుంగతుర్తి సర్పంచ్ కుంచర్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు, శనివారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవం వేడుకలలో పాల్గొని మాట్లాడారు, ప్రతి విద్యార్థి కృషి పట్టుదల క్రమశిక్షణ ఉంటే జీవితంలో సాధించలేనిది ఏది ఉండదని అన్నారు, నేటి బాలలే రేపటి పౌరులని రాబోవు కాలంలో విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పింది మంచిగా విని చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండి ఉపాధ్యాయులు చెప్పే బోధనను శ్రద్ధగా విని కష్టపడి ఇష్టంతో చదవాలన్నారు, ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వేషధారణ తో మెయిన్ రోడ్డుపై కార్ల కాన్వాయ్ తో సందడి చేసి అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు, విద్యార్థులు ఉపాధ్యాయులుగా వేషధారణతో తరగతి గదిలోకి ప్రవేశించి చక్కగా విద్యాబోధన చేశారు, వీరి వేషాధారణ పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ బింగి లక్ష్మయ్య, నరేందర్ దేవేందర్ కార్తీక్ రెడ్డి సైదులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com